క్లుప్తంగా

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 ఏఈఈ ఆపరేషన్స్ జి.వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కవిరాజ్‌నగర్, వైరారోడ్, న్యూవిజన్ స్కూల్, కోర్టు, బైపాస్ రోడ్, వీడీవోస్ కాలనీ, బ్యాంకు కాలనీ, సహకారనగర్, గట్టయ్యసెంటర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు.

నేడు మంత్రి పొంగులేటి సమీక్ష

తిరుమలాయపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై గ్రామాల్లోని ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలతో కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆదివారం క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామాల వారీగా సమీక్షించేందుకు సోమవారం ఉదయం 10 గంటల కల్లా అందరూ సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

నేడు మార్కెట్ ఎదుట ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: ఎలాంటి ఆంక్షలు లేకుండా పత్తికి మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఆధ్వర్యాన ధర్నా చేస్తున్నట్లు సంఘ బాధ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం చొరవ చూపి రైతులను ఆదుకోవాలని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ ధర్నాలో రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నేడు శివలింగ ప్రతిష్ఠా మహోత్సవం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లో గల సాయి మందిరంలో నూతనంగా నిర్మించిన సుబ్రహ్మణ్యస్వామి జంట నాగులతో కలిపి ఉన్న శివలింగ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నేడు(సోమవారం)నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను నిర్వహించబడుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పదో తరగతి(2006-07 బ్యాచ్)కి చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో సంతోషంగా పలకరించుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని నిర్ణయం తీసుకున్నారు.

ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి అభినందనలు

ఖమ్మంఅర్బన్: ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఖమ్మం వాసి డాక్టర్ బొలికొండ శ్రీనివాస్ ఆదివారం బీజేపీ ఖమ్మం అర్బన్, టౌన్ అధ్యక్షుడు కుమలి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంత ఉపేందర్ గౌడ్, సోమగాని ఎల్లారావు గౌడ్, బోయినపల్లి సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	46	బచ్చలికూర	3
వంకాయ	54		20
బెండకాయ	34	పాలకూర	3
పచ్చిమిర్చి	58		20
కాకర	44	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	38	తోటకూర	3
దొండ	36		20
పొట్లకాయ	48	గోంగూర	5
చిక్కుడు	94		20
గోరుచిక్కుడు	80	మెంతికూర	2
క్యాబేజీ	34		20
క్యాలీఫ్లవర్	45	కొత్తిమీర	1
ఆలుగడ్డ	34		40
చామగడ్డ	54	పుదీన	1
క్యారెట్	58		25
క్యాప్సికం	90	-ఖమ్మం వ్యవసాయం	

సమగ్ర సర్వేకు సన్నద్ధం..!

6 నుంచి కుటుంబ సర్వే ప్రారంభం

- 75 ప్రశ్నలతో సర్వే ఫామ్
- కేఎంసీలో 946 ఎన్యూమరేట్ బ్లాక్‌లు, పాలేరు డివిజన్‌లో 650 మంది ఎన్యూమరేటర్ల గుర్తింపు
- ఒక్కో బ్లాక్‌లో 150 వరకు కుటుంబాలు



నేలకొండపల్లి: ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ మానిక్‌రావ్

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)కు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేశారు. సర్వే చేయనున్న ఇళ్లకు ఎన్యూమరేటర్లు స్టిక్కర్లు అతికించగా.. అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే పూర్తి చేస్తారు. ఇందులో కుటుంబానికి సంబంధించి పలు అంశాలను అడుగుతారు.

ఇవి దగ్గరుంటే చాలు..

సర్వే కోసం వచ్చిన అధికారులకు రేషన్ కార్డులు, విద్యుత్ కనెక్షన్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, రైతు అయితే ధరణి పాస్ బుక్ వివరాలు, బ్యాంక్ అకౌంట్ వంటి వివరాలతో పాటు గత ఐదేళ్లలో లబ్ధి పొందిన ప్రభుత్వ పథకాలు, స్థిర, చరాస్తి తదితర వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. అయితే సర్వే సమయాన అందరూ ఉండాల్సిన పనిలేదు.. ఇంటి యజమాని ఉంటే చాలు. ఎటువంటి డాక్యుమెంట్లు తీసుకోరు. కాగా బ్యాంక్ ఏటీఎం కార్డు నంబర్, పిన్ వంటివి అడిగితే ఇవ్వొద్దని అధికారులు చెబుతున్నారు.

ఖమ్మం నియోజకవర్గంలో..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ) పరిధిలో ప్రస్తుతం ఉన్న ఇళ్ల సంఖ్య ఆధారంగా నివాస కుటుంబాల సంఖ్యను అంచనా వేశారు. 2011 సెన్సెస్ సమయాన నాడు మున్సిపాలిటీగా ఉన్న ఖమ్మంలో 346 ఎన్యూమరేట్ బ్లాక్‌లు ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 946 మంది ఎన్యూమరేటర్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వీరిని పర్యవేక్షించేందుకు 20 మంది సూపర్‌వైజర్లను నియమించనుండగా.. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 వరకు కుటుంబాలను సర్వే చేసేలా ప్రణాళికలు చేశారు. ఇందు కోసం 100 మంది ఆశ వర్కర్లు, 258 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 168 మంది ఆర్పీలను ఎన్యూమరేటర్లుగా నియమించడంతో పాటు మరో 450 మంది టీచర్లను నియమించనున్నారు. ఇప్పటికే సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వగా, ఎన్యూమరేటర్లకు శిక్షణ పూర్తికావొచ్చిందని అధికారులు పేర్కొన్నారు.

సర్వే సమయాన..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి 8 పేజీలతో కూడిన సర్వే ఫామ్‌ను ఎన్యూమరేటర్లకు అందించనున్నారు. సాధారణ వివరాల కింద కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, సంబంధం, మతం సామాజిక వర్గం, వయసు, మాతృ భాష, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్లు, దివ్యాంగులైతే వైకల్యం, వైవాహిక స్థితి గురించి ఆరా తీస్తారు. విద్యా వివరాల కింద పాఠశాలలో చేరిన నాటికి వయసు, విద్యార్హత ఏ మీడియంలో చదివారు.. బడి మానేస్తే వివరాలు చెప్పాల్సి ఉంది. ఇక ఉద్యోగ, ఉపాధి వివరాలు విషయానికొస్తే ప్రస్తుతం చేసే పని, వృత్తి ఉద్యోగ, ఉపాధి సమాచారం, వార్షికాదాయం, ఒక వేళ వ్యాపారులైతే వార్షిక టర్నోవర్ చెప్పాలి. కుల వృత్తులైతే ఆ వృత్తి కొనసాగిస్తారా.. కుల వృత్తితో కలిగిన ఆదాయం, కుటుంబం అప్పులు, ఎందుకు తీసుకున్నారు?, ఇంట్లో పన్ను చెల్లించే వారు ఉన్నారా?, ప్రజాప్రతినిధిగా పనిచేసిన వివరాలు, ఇతరత్రా వివరాలు ప్రశ్నావళి రూపంలో 75 అంశాలపై ఆరా తీస్తారు.

పాలేరు నియోజకవర్గంలో..

పాలేరు డివిజన్‌లోని కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండలాలలో మొత్తం 650 మంది ఎన్యూమరేటర్లను ఎంపిక చేసి అవగాహన కల్పించారు. సర్వేను పరిశీలించేందుకు ఆయా మండలాల అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు, మండల పంచాయతీ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ఏఎస్ఓలను సూపర్‌వైజర్లుగా నియమించారు. ప్రతీ మండలానికి 12 మంది చొప్పున 46 మంది సూపర్‌వైజర్లను నియమించారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..



ఈనెల 6 నుంచి చేపట్టనున్న సమగ్ర సర్వేకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకు 946 ఎన్యూమరేట్ బ్లాక్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చి సేకరించాల్సిన జాబితా కాపీలను ప్రింట్ తీపిస్తున్నాం.

– అభిషేక్ అగస్త్య, కేఎంసీ కమిషనర్

సర్వేకు సహకరించాలి..



సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు నేలకొండపల్లి మండల వ్యాప్తంగా 160 మంది ఎన్యూమరేటర్లు, 12 మంది సూపర్‌వైజర్లను నియమించాం. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించాలి..



పాఠశాల స్థాయి విద్య కుంటుపడకుండా సర్వేలో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించాలి. లేకుంటే విద్యార్థుల అభ్యాసన స్థాయి తగ్గుతుంది. ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులతో సర్వే సరైన విధానం కాదు.

– టి.వెంగళరావు, ఉపాధ్యాయుల సంఘం నేత, నేలకొండపల్లి

సంకల్పం మంచిదైతే సమాజం తోడుంటుంది



కాశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంరూరల్: సంకల్పం మంచిదైతే సమాజ తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పోలేపల్లిలో గల గురుదక్షిణ ఫౌండేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చేకూరి కాశయ్య విగ్రహాన్ని మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గురుదక్షిణ ఫౌండేషన్‌కు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని, సంస్థ వారు అందరికీ ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు కొనసాగించాలని తెలిపారు. కాశయ్య ఎస్‌వీ.నారాయణ చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. ఫౌండేషన్‌కు సంబంధించిన భూమికి హద్దులు గుర్తించి, భూమి ఎక్కడా ఆక్రమణకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం మంత్రి తుమ్మలను, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దుగ్గినేని సత్యనారాయణను సంస్థ సభ్యులు, శిష్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఫౌండేషన్ చైర్మన్, కార్యదర్శులు చావా సత్యనారాయణ, ప్రసాద్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఐ జిల్లా నాయకులు పోటు ప్రసాద్, బాగం హేమంతరావు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు, ఎంపీల నివాళి..

ఖమ్మంరూరల్: మండలంలోని కొండాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నాగండ్ల బాబు ఇటీవల మృతి చెందగా ఆదివారం దశదిన కర్మ జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిలు బాబు చిత్రపటానికి నివాళులర్పించారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నం బ్రహ్మయ్య, బండి జగదీష్, మద్దినేని స్వర్ణకుమారి, బోడా వెంకన్న తదితరులున్నారు.

రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానించిన దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వాకాదాని శ్రీనివాసరావు, వై.ఉమారాణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో జరిగిన డీలర్ల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. కోశాధికారిగా గోర్ల మురళి, టెక్నికల్ సెక్రటరీగా ఆర్.సాయికృష్ణ, లీగల్ కార్యదర్శిగా షేక్.లాల్‌జాన్‌పాషాతో పాటు 22 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నికున్నట్లు నూతన కమిటీ పేర్కొంది. డీలర్ల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని డీలర్లు ప్రమాణస్వీకారంతో పాటు సన్మానించి, అభినందించారు.

టీపీటీఎఫ్ మండల నూతన కమిటీ..

రఘునాథపాలెం: టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) రఘునాథపాలెం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆర్.హనుమంతరావు, డి.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.టీపీటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో జరిగిన రఘునాథపాలెం మండల జనరల్ కౌన్సిల్‌లో మండల అధ్యక్షుడిగా ఆర్. హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా డి.రమేష్ ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు ఎం.నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు, జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎం.నాగిరెడ్డి, ఉమాదేవి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

దేశంలో పేదరికం పెరుగుతోంది



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలోని సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై పేదరికం పెరుగుతోందని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక మంచికంటి మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన మహా సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ విధానాల వల్ల రాష్ట్రంలో బీజేపీ బలపడుతోందని, బీఆర్ఎస్ అణిచివేత ధోరణితో అధికారాన్ని కోల్పోయిందని, హామీల అమలులో కాంగ్రెస్ నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. హామీల అమలులో నిర్లక్ష్యంపై పోరాటాలే శరణ్యమని ప్రజానీకం భావిస్తున్న తరుణంలో కమ్యూనిస్టు పార్టీలు మరింత కీలకంగా వ్యవహరించాలని సూచించారు. మచ్చా సూర్యం అధ్యక్షతన జరిగిన పార్టీ టూ టౌన్ కమిటీ మహాసభల్లో కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ నివేదిక సమర్పించారు. తిరిగి పార్టీ టూ టౌన్ కమిటీ కార్యదర్శిగా బోడపట్ల సుదర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, సీపీఎం టూటౌన్ కమిటీ మహాసభల సందర్భంగా నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐలూ రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్ర శ్రీకాంత్, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బీవీకే ట్రస్ట్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, జబ్బర్, నవీన్‌రెడ్డి, ఝాన్సీ, తిరుపతిరావు, మెరుగు సత్యనారాయణ, మనోహర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కమ్యూనిస్టులదే..

ఖమ్మంరూరల్: భారత దేశంలో భవిష్యత్ కమ్యూనిస్టులదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని గోళ్లపాడులో జరిగిన సీపీఎం రూరల్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మండలంలోని పేదలకు, అట్టడుగు వర్గాలకు, దళితులకు, గిరిజనులకు అండగా నిలిచింది ఎర్రజెండా మాత్రమేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతూ అధికారం చలాయిస్తున్నారని విమర్శించారు. ప్రజలు, దేశాలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నాయని, అందుకే శ్రీలంకలో నూతనంగా కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. ఈమహాసభలో సీపీఎం నాయకులు నండ్ర ప్రసాద్, పి.మోహన్‌రావు, ఎస్.కృష్ణ, పి.సంగయ్య, వి.సుదర్శన్‌రెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, కొప్పుల రామయ్య, పగిడిపల్లి ఉపేందర్, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'చలో వరంగల్'కు తరలిన ఉద్యమకారులు

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల నుంచి తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులు చలో వరంగల్ మహాసభకు ఆదివారం తరలివెళ్లారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు బత్తుల సోమయ్య ఆధ్వర్యాన వివిధ వాహనాల్లో వరంగల్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల జేఏసీ నాయకులు మాదాసు శ్రీనివాస్, తీగ రాములు, ఎ.భిక్షం, రామారావు, వీరబాబు, వెంకటనారాయణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఆదివారం మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పన్ వెన్నపూసల సీతారాములు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పార్టీ నాయకుడు కుక్కల హనుమంతరావు పాల్గొన్నారు.

బీసీ కమిషన్‌లో వాదనలు వినిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 5న నిర్వహించనున్న బీసీ కమిషన్ సమావేశంలో తమ వాదనలు వినిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణమాచారి తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమావేశం నిర్వహించనుండగా.. చైర్మన్‌తో పాటు సభ్యులు కూడా హాజరవుతారన్నారు. దశాబ్దాలుగా సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, ఉపాధి రాజకీయ రంగాల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై తమ వాదనలు వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగబోయిన పుల్లారావు, మహిళా అధ్యక్షురాలు సుగుణ, ఉపాధ్యక్షుడు మల్లెలి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు గద్దె వెంకట్రామయ్య, కె.నాగేశ్వరరావు, సామర్తి నాగేశ్వరరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విలీనానికి ఏకాభిప్రాయం

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీలో బారుగూడెం శివారు శ్రీసిటీని మున్సిపాలిటీలో విలీనం చేయడంపై అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన అధికారులు విలీనం చేయడం తమకు సమ్మతమేనని సభకు వచ్చిన వారు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ద్వారా అభివృద్ధి నామమాత్రంగానే జరిగిందని, భవిష్యత్‌లో శ్రీసిటీ మరింత అభివృద్ధి చెందాలంటే మున్సిపాలిటీలో విలీనమే పరిష్కారమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజారావు, శ్రీసిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు, సీఈఓ విజయ్, శ్రీసిటీ వాసులు విజయారెడ్డి, రమేష్, సతీష్, నరేంద్ర రాజు, నాగరవిప్రసాద్, మాజీ సర్పంచ్ పొందు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం



భోజనాలు చేస్తున్న అయ్యప్ప మాలాధారణ భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ పంపింగ్‌వెల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన శ్రీహరహర సుతన్ నిత్యాన్నదాన కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. 41 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని పారిశ్రామిక వేత్త, కాంగ్రెస్ నాయకుడు సాధు రమేష్‌రెడ్డి దంపతులు ప్రారంభించారు. శ్రీహరిహర సుతన్ నిత్య అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలాధారుల కోసం నిత్యం మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు అన్నదానం చేయబడుతుందని ట్రస్ట్ చైర్మన్ పల్లెపు ఉపేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లెపు సైదులు, పిచ్చయ్య, రమేష్, అఖిల్, శ్రీనాథ్, బన్ని, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం మున్నేరు వరద బాధితులకు అభయ ఫౌండేషన్, విహెచ్‌ దేవకి ఫౌండేషన్ బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవకి వాసుదేవరావు ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మం రామకృష్ణా విద్యాలయంలో దాదాపు వెయ్యి మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. రెండు దిండ్లు కవర్లు, రెండు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వనమా వేణుగోపాల్, విహెచ్ కార్యదర్శి చంద్రశేఖర్, జయంత్‌పటేల్, కేశవ్‌లాల్ పటేల్, బీజేపీ నాయకులు నకిరికంటి వీరభద్రం, కొణతం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద శ్రీహరి ఆశయ సాధనకు పోరాడుదాం



రాజారంలో నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: విద్యార్థి ఉద్యమ నాయకుడు, కామ్రేడ్ శ్రీపాద శ్రీహరి ఆశయ సాధన కోసం విద్యార్థులు పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. మండలంలోని రాజారాం గ్రామంలో ఆదివారం శ్రీపాద శ్రీహరి వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్మారక స్తూపం వద్ద అమరవీరులను స్మరించుకున్నారు. నేటి పాలకులు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శ్రీపాద శ్రీహరి స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. మత ఉన్మాదం పేరుతో చిచ్చులు పెడుతూ మతసామరస్యాన్ని దెబ్బతీస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు తిమ్మిడి హనుమంతరావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.లక్ష్మణ్, వి.వెంకటేష్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, రాజారం గ్రామ సీనియర్ నాయకుడు పేర్ల భిక్షం, రాములు, పాపయ్య, పృథ్వీ, పండు, నవీన్, వెంకటేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ చైతన్యంపై అవగాహన

ఖమ్మంరూరల్: న్యాయ చైతన్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని పారా లీగల్ వలంటీర్ ఎం.నాగమణి సూచించారు. మండలంలోని గోళ్లపాడులో ఉచిత న్యాయ సాయంపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ సలహాలు, కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేద బలహీనవర్గాల వారికి ఉచిత న్యాయ సాయాన్ని అందించనున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారికి, మానవ అక్రమ రవాణా బాధితులు, స్త్రీలు, పిల్లలు, మతిస్థిమితం లేనివారు, అవిటివారికి, సామూహిక విపత్తు, హింసాకాండ, కుల వైష్యమాలు, అతివృష్టి, అనావృష్టి భూకంపాలు, పారిశ్రామిక విపత్తులు వంటి వాటిలో చిక్కుకున్న వారికి న్యాయ సాయం అందిస్తామన్నారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని, ఆడ పిల్లలను అక్రమ రవాణా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికులు కార్డులను పొందాలని, అర్హత కలిగిన వారు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పారా వలంటీర్లు బి.సుశీల, ఎం.డీ.రంజాన్‌బీ పాల్గొన్నారు.

ఖురాన్ బోధనలు అనుసరణీయం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖురాన్ బోధనలు అనుసరణీయమని జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అస్మా అంజుమ్ అన్నారు. ఆదివారం ఖమ్మం అజీజ్‌గల్లీలోని సంఘ కార్యాలయంలో మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై ఆన్‌లైన్ వీడియో పోటీలలో గెలుపొందిన 70 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సభలో నస్రీన్, ఫాతిమా, సుమయ్య, తరున్నం, సదఫ్, షాజియా, అఫ్నా, అమేరా, సీమా, ఇరమ్, నాజియా, తబస్సు, సబిహ, తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నేలకొండపల్లి: భక్తరామదాసు సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యాన మండలంలోని రాజేశ్వరపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వివిధ గ్రామాల నుంచి 150 మంది హాజరై పలు రోగాలకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు పాటుపడాలి



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మంఅర్బన్: అమరవీరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రామయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెం గ్రామంలో పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యాన అమరవీరుల స్తూపం వద్ద జెండా ఆవిష్కరించాక జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో నక్సలిజాన్ని తుదిముట్టిస్తామని చెప్పడం దుర్మార్గమని, దేశంలో దోపిడీ అణిచివేత ఉన్నంతకాలం ప్రశ్నించే వారు, ప్రజా ఉద్యమాలు, నక్సలిజం ఉంటుందన్నారు. చరిత్రలో అనేకమంది నక్సలైట్ ఉద్యమాన్ని అణిచివేస్తామని ప్రగల్భాలు పలికిన నాయకులెవరు సాధించలేదన్నారు. అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమాలను అభివృద్ధి చేసి, పేద ప్రజల విముక్తి కోసం పోరాడం చేసినప్పుడు మాత్రమే అమరవీరులకు నిజమైన నివాళులర్పించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, జె.లెనిన్, చింతపల్లి వెంకటనారాయణ, బొమ్మకంటి రమేష్, రామనాథం, ములకలపల్లి లక్ష్మీనారాయణ, రాచబంటి రవి, నాగయ్య, భరత్, శోభన్, పాషా, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.